క్లుప్తంగా

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



కె. కొత్తపాలెం(మోపిదేవి): తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. మండలంలోని కె. కొత్తపాలెం గ్రామంలో జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఆసక్తిగల విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను ఉపాధ్యాయులు అందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లవోలు వరలక్ష్మి, కమిటీ సభ్యులు మత్తి వెంకట రాజా చంద్, సీఆర్పీ కేసాని ధనరాజ్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానం, యోగాలో శిక్షణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో విద్యార్థులతో ధ్యానం, యోగా చేయించారు. పుస్తకాలు చదివించి డ్రాయింగ్ నేర్పించారు. స్పోకెన్ ఇంగ్లిష్, భగవద్గీత శ్లోకాల పఠనంలో శిక్షణ ఇచ్చారు. ఉప గ్రంథాలయ అధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

భానుడి భగభగ

మచిలీపట్నంటౌన్: గురువారం రోహిణీకార్తె కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు ప్రతాపం చూపాడు. నాలుగు గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. రోహిణీకార్తె రోజు వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకు మేలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కొక్కిలిగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు మేలు జరిగిందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆయన పాలనలో ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అంది ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉన్నారని చెప్పారు. మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామ సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ పార్టీ కన్వీనర్ రాయన సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబుతో కలిసి 277 గృహాలను సందర్శించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటా అపూర్వ స్పందన లభించింది. పంట పొలాల్లో పనిచేస్తున్న మహిళా కూలీలను కలిసి ప్రభుత్వం నుంచి అందిస్తున్న పథకాలను, కూలీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగనన్నను దీవించాలని కోరారు. అంతర్గత రహదారులతో పాటు కేఈబీ కెనాల్‌కు రివిట్‌మెంట్ చేయించాలని గ్రామస్తులు కోరారు. పెదకాలువకు రివిట్‌మెంట్ లేకపోవడం వల్ల వర్షాకాలంలో రహదారి పూర్తిగా కోతకు గురవుతోందని చెప్పారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రాయన శంకరరావు, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు ఆది రాంబాబు, తుటారం కృష్ణ, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, మోర్ల శ్రీనివాసరావు, మీసాల చిట్టిబాబు, కేసాని వెంకటేశ్వరరావు, కేసాని సుబ్రహ్మణ్యం, నందిగం అభిషేకరావు, కేసాని గోవింద రాజులు, గుంటూరు దయామణి, ఎస్‌ఐ పద్మ, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, నాయకులు పాల్గొన్నారు.



మహిళా కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, వికాస్‌బాబు

వలంటీర్ వ్యవస్థను చూస్తే టీడీపీకి వణుకు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే రమేష్‌బాబు :



పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: గ్రామ, వార్డు వలంటీర్లను ఒకప్పుడు టీడీపీ నాయకులు అవహేళన చేశారనీ, ఇప్పుడు అదే వలంటీర్ల వ్యవస్థను చూస్తే టీడీపీకి వణుకు పుడుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు విచ్చేసి సేవారత్న, సేవామిత్ర అవార్డులను వలంటీర్లకు అందించి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఇంటింటికీ వెళుతుంటే, తమ వెన్నంటి నిలిచి గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామాల్లో సక్రమంగా అందిస్తూ అవినీతికి తావు లేకుండా పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్ల సేవల ఫలితంగా తాము ఇంటింటికీ వెళ్లినప్పుడు పేదల కళ్లల్లో కనిపించే సంతోషం వెలకట్టలేనిదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ల వ్యవస్థ అద్భుతమైన ఫలితాలు అందిస్తోందని, తద్వారా దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గుర్రం బసవయ్య, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిగడ్డలో వలంటీర్లకు అవార్డుల ప్రదానం

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఒకరికి సేవారత్న, 26 మందికి సేవామిత్ర పురస్కారాలు అందించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయకుమార్ చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్లు వచ్చిన తరువాత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు లబ్ధిదారుల ఇళ్లకే చేరుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బందరు అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

పేర్ని కిట్టు



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గురువారం నగరంలోని 25, 29 డివిజన్లలో అభివృద్ధి పనులకు నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. 25వ డివిజన్‌లో రూ. 25 లక్షలతో నిర్మించనున్న తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 29వ డివిజన్‌లో రూ. 7 లక్షలు, రూ. 3.20 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ బందరు అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో ఎన్నో ప్రాజెక్టులు తీసుకువచ్చారన్నారు. రానున్న రోజుల్లో మచిలీపట్నంను మరింత అభివృద్ధి చేసే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి దీవించాలని కోరారు. దీర్ఘకాలికంగా ఉన్న ఈ రెండు డివిజన్లలోని సమస్యలతో పాటు నగరంలోని ఇతర డివిజన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 25వ డివిజన్‌లో పైప్‌లైన్ పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా సమృద్ధిగా అందుతాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయిందని ఈ పైప్‌లైన్ పనులు, పక్కా డ్రెయిన్ పనులు వెంటనే ప్రారంభిస్తారని తెలిపారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి, నిధులు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 25, 29 డివిజన్ల కార్పొరేటర్లు కొలుసు విజయగంగ, కట్టా కేదారేశ్వరరావు, కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై అవగాహన కల్పించాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస పెరుమాళ్లు

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని మచిలీపట్నం డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్లు అన్నారు. మండల పరిధిలోని పులిగడ్డలో ఏపీ వైద్యశాఖ, అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన 104 వైద్య సేవలను వేకనూరు పీహెచ్‌సీ డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీనివాస పెరుమాళ్లు గురువారం పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి రోగులను డాక్టర్ పర్యవేక్షిస్తున్న తీరుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా 50 మంది రోగులను డాక్టర్ నాగార్జున పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పుష్పదీవెన, ఏఎన్ఎం సుగుణ, 104 మండల డీఈఓ పి. స్వాతి, సిబ్బంది జి. నాంచారయ్య, ఆశా వర్కర్ నిర్మల, భ్రమరాంబ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఉల్లిపాలెంలో పూరిల్లు దగ్ధం



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

కోడూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు నిట్టాడిల పూరిల్లు దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉల్లిపాలెం గ్రామంలో చాట్రగడ్డ రంగారావు కుటుంబ సభ్యులు రెండు నిట్టాడిల పూరింటిలో నివాసముంటున్నారు. ఇంటి పక్కనే మేకల కోసం ప్రత్యేక చావిడిని నిర్మించారు. గురువారం మధ్యాహ్నం సమయంలో రంగారావు కుటుంబ సభ్యులతో కలిసి పనిపై బయటి ప్రాంతానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు వ్యాపించకుండా ప్రయత్నించారు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

రూ.5 లక్షల ఆస్తినష్టం..

ప్రమాదంలో రూ.5 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు రంగారావు అగ్నిమాపక అధికారి పీవీఎస్ ప్రసాద్‌కు తెలిపారు. మేకలను విక్రయించడం ద్వారా వచ్చిన రూ.4.50 లక్షల నగదు ఇంట్లోనే ఉందని, వీటితో పాటు బంగారం, విలువైన వస్తువులు, గృహోపకరణలు, డాక్యుమెంట్లు పూర్తిగా అగ్నికి అహుతయ్యాయని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

విద్యుత్ పొదుపుపై అవగాహనా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విద్యార్థులు

పెడన: ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు పాటించాలని నందమూరు సర్పంచ్ పరసా నరసింహారావు అన్నారు. శ్రీ వాసవి ఇంజినీరింగ్ విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామంలో విద్యుత్ పొదుపుపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. అవసరమైతేనే విద్యుత్‌ను వాడుకోవాలని, అనవసరమైన వాటికి వాడుకోవడం వల్ల విద్యుత్ వృథా అవుతోందన్నారు. అనవసరంగా విద్యుత్‌ను వినియోగించుకోవడం వల్ల అత్యవసర పరిస్థితి ఏర్పడి విద్యుత్ కొరత వస్తుందని చెప్పారు. ఆ పరిస్థితి రాకుండా ముందునుంచే జాగ్రత్తలు తీసుకుని విద్యుత్ పొదుపును పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా ఉదయ్ కుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్, నగదు అందజేత



మచిలీపట్నంటౌన్: ఆదివెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్, రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. డాక్టర్ పీవీఆర్ చారిటబుల్ ఫౌండర్, చైర్మన్ పిల్లారిశెట్టి వెంకట రమేష్‌బాబు బీటెక్ చదువుతున్న పేద వెలమ విద్యార్థిని మాదిరెడ్డి రామలక్ష్మికి రూ. 40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్, విద్యార్థి మాదిరెడ్డి కామేష్‌కు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివెలమ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పిల్లారిశెట్టి సత్యనారాయణ, మాదిరెడ్డి హరి, ఆంజనేయులు, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్వామిత్ర రికార్డుల పరిశీలన

పెడన: మండలంలోని పెనుమల్లి గ్రామ సచివాలయంలో స్వామిత్ర రికార్డులను జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ పరిశీలించారు. నేలకొండపల్లిలో 269, కుమ్మరిగుంటలో సుమారు 190 వరకు భూముల రికార్డులున్నాయన్నారు. వీటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. మచిలీపట్నం డీఎల్‌పీఓ ఐ. జ్యోతిర్మయి, పెనుమల్లి సర్పంచ్ గరికిపాటి వెంకట రామానాయుడు, నేలకొండపల్లి సర్పంచ్ వూచా వెంకటేశ్వరరావు, పెడన ఈఓపీఆర్డీ ఎం. జయరాము, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టిన మట్టి ట్రాక్టర్



కోనేరుసెంటర్: బందరు మండలం మంగినపూడి సెంటర్‌లోని డాబాల సెంటర్ సమీపంలో ఓ మట్టి ట్రాక్టర్ బందరు వైపు వస్తూ అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. డ్రైవర్ ట్రాక్టర్‌పై నుంచి పక్కకు దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు.

పచ్చిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

రామవరప్పాడు: రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగపరుచుకోవాలని డీడీఏ మాధవీలత అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న రైతు భరోసా కేంద్రంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఒక రోజు విత్తనం నుంచి విక్రయం వరకు శిక్షణ కార్యక్రమంతో పాటు మిషన్ లైఫ్‌పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పంట పుష్పించే దశలో భూమిలో కలియ దున్నడం వల్ల ప్రధాన పోషకమైన నత్రజనిని, సూక్ష్మపోషకాలను ఎక్కువ మోతాదులో అందిచవచ్చని తెలిపారు. అనంతరం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మట్టి నమూనా సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏపీ మోనీషా, ఏఓ రంగనాథ్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు బిందు, మౌనిక, ఉద్యానవన సహాయకులు శ్యామ్‌పాల్ పాల్గొన్నారు.

ముగిసిన రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



బంటుమిల్లి: ఆముదాలపల్లి గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు గురువారంతో ముగిశాయి. బుధవారం రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం పండితులు సోమశేఖరపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి, అమ్మ వారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉంచి మేళతాళాలతో శివనామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు గోపాలం పర్యవేక్షించారు.

నేటి నుంచి నిర్భయానంద స్వామి ఉత్సవాలు

పాగోలు(చల్లపల్లి): నిర్భయానంద స్వామి వారి ఉత్సవాలు గ్రామంలోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు జరుగుతాయని నిర్వాహకులు, ఎంపీటీసీ మేకా సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్వామి వారి ప్రథమ ఆరాధన ఉత్సవాలు, 28వ తేదీ నిర్భయానంద స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయన్నారు. నిర్భయానంద శిష్య బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

మచిలీపట్నంటౌన్: ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎల్అండ్‌టీ, సైకి ఫ్రీ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (సోలార్) కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఏ కళాశాలలోనైనా ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భూ రీ సర్వేపై గ్రామ సభలు

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో 106 సంవత్సరాల తరువాత వైఎస్సార్, జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ప్రవేశ పెట్టిందని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. మోపిదేవి, పెదప్రోలు గ్రామ సచివాలయాల వద్ద ఆయా గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, పొలిమెట్ల ఏసుబాబు అధ్యక్షతన గురువారం గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 4వ ఫేజ్ భూ రీ సర్వే మోపిదేవి, పెదప్రోలు, వెంకటాపురం గ్రామాల్లో చేపట్టామన్నారు. జియో కో–ఆర్డినేట్ ద్వారా 30 కిలో మీటర్ల వరకు రోవర్ పరికరం రీ సర్వే కవర్ చేస్తుందని చెప్పారు. ఒక్కొక్క రైతు భూమి ఎల్‌పీ నెంబర్‌గా తయారు చేసి గ్రామపటంగా సిద్ధం చేస్తారని, ప్రభుత్వ భూమి డొంకలు, చెరువులు తదితర భూమి రీ సర్వేలో వస్తాయని వివరించారు. మండల సర్వేయర్ సుంకర రామకృష్ణారావు, గ్రామ కార్యదర్శులు త్రిపుర సుందరి, పేర్ని మాధవేంద్రరావు, వీఆర్వోలు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో ద్రాక్షారసం పంపిణీ



మచిలీపట్నంటౌన్: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుపేటలో పాదచారులకు ద్రాక్షా రసాన్ని గురువారం పంపిణీ చేశారు. గొడుగుపేటలోని సాయి డిస్కో డెకరేషన్ సంస్థ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద గత 41 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా దాత డీవీ సాంబశివరావు ఆధ్వర్యంలో పాదచారులకు ద్రాక్షరసాన్ని అందజేశారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, వనిత క్లబ్ ప్రతినిధులు వేముల శిరీష, జె. దివ్యశ్రీ, టి. అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నాగలక్ష్మి దంపతులకు సన్మానం



బంటుమిల్లి: పెద తుమ్మిడి పంచాయతీ శివారు నరసప్ప చెరువు గ్రామానికి చెందిన మానికొండ నాగలక్ష్మి దంపతులను గ్రామస్తులు, గీతా సత్సంగ భక్తులు గురువారం ఘనంగా సన్మానించారు. మైసూరు దత్తపీఠం స్వామీజీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం వారు దక్షిణ భారత స్థాయిలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పఠనంలో నాగలక్ష్మి 700 శ్లోకాలు పఠించి బంగారు పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని స్వామీజీ చేతులమీదుగా అందుకున్నారు. అనంతరం నాగలక్ష్మి ఆన్‌లైన్‌లో పలువురు భక్తులకు భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భగవద్గీత శ్లోకాలు పఠించిన శిష్యులు కలిసి మానికొండ నాగలక్ష్మి, రాఘవరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు.